ప్రజాశక్తి
మంగళవారం 18 ఏప్రిల్ 2023 5 విజయనగరం

సామాజిక మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో సామాజిక మరుగుదొడ్ల సక్రమ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజారోగ్య అధికారులకు, సిబ్బందికి కమిషనర్ ఆర్ శ్రీరాములు నాయుడు ఆదేశించారు. సోమవారం ప్రజారోగ్య సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. నగరంలో వివిధ సంఘాల ద్వారా సామాజిక మరుగుదొడ్లు నిర్వహణ జరుగుతుందని అన్నారు. అయితే ఆయా సంఘాలలో కొన్ని సంస్థలు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో మరుగుదొడ్ల సక్రమ నిర్వహణపై పరిశీలన జరిపి తగు చర్యలు చేపడతామని అన్నారు. నగరంలో ఆక్రమణలు పెరిగిపోయినట్లు స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చారని, వాటిని తొలగించేందుకు నగర ప్రణాళిక అధికారులకు ఆదేశించామన్నారు. కాలువలపై ఆక్రమణలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. సమావేశంలో ఎసిపి అమ్మాజీ రావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ సత్యనారాయణ, పారిశుధ్య పర్యవేక్షకులు సిబ్బంది పాల్గొన్నారు.

కుంటినవలస వద్ద స్థల పరిశీలన చేస్తున్న రాష్ట్ర, కేంద్ర బృందాలు (ఫైల్)

- ఎయిర్‌పోర్టుపై ఉన్న శ్రద్ధ గిరిజన వర్శిటీపై ఏదీ?
- ఏళ్లు గడుస్తున్నా అప్పగించని భూమి
- అరకొర సదుపాయాలతో వర్శిటీ నిర్వహణ
- వసతుల్లేక వెనక్కిపోతున్న విద్యార్థులు

విద్యపై నిర్లక్ష్యం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సమాజాభివృద్ధికి, దేశాభివృద్ధికి అత్యంత కీలకమైన విద్యారంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. దీంతో, జిల్లా కూడా వెనుకబాటుకు గురవుతోంది. చివరకు ఆకాశ మార్గంపైవున్న శ్రద్ధ కూడా వర్శిటీ ఏర్పాటుపై చూపకపోవడంతో ఇటు అధ్యాపకులు, అటు విద్యార్థులు తీవ్రఅవస్థలు పడుతున్నారు. ఈసమస్యలను ఎదుర్కోలేక ఇతర వర్శిటీలకు విద్యార్థులు మళ్లిపోతున్నారు. 2014లె రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా విజయనగరం జిల్లాలో గిరిజన యూనివర్శిటీని తలపెట్టిన విషయం విధితమే. రూ.420కోట్ల యుజిసి (యూనివర్శిటీ గ్రాంట్ కమిషన్) నిధులతో విద్యాలయ భవన నిర్మాణ పనులకు చేపట్టేందుకు 2015లోనే కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇందుకు అవసరమైన భూమిని అప్పగించడంలో రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. ఇదే అదునుగా కేంద్ర ప్రభుత్వం కూడా తగినంతగా నిధులు కేటాయించడం లేదు. టిడిపి ప్రభుత్వ హయాంలో కొత్తవలస మండలం రెల్లిలో భూమిని కేటాయించిన విషయం విధితమే. వైసిపి అధికారంలోకి వచ్చాక స్థల మార్పుపేరుతో రెండేళ్ల కాలక్షేపం చేసింది. ఏడాదిన్నర క్రితం మెంటాడ మండలం కుంటినవలస రెవెన్యూ పరిధిలో 561ఎకరాల భూమి కేటాయించారు. భూ సేకరణ ఇప్పటికీ పూర్తిచేయలేదు. ఇదే అదునుగా కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయింపులో తాత్సారం చేస్తోంది.

యూనివర్శిటీకి తొలి నాలుగేళ్లు నిధులు కేటాయించలేదు. ఎట్టకేలకు 2019-20లో ఎపి, తెలంగాణా రాష్ట్రాల్లో తలపెట్టిన గిరిజన యూనివర్శిటీలకు రూ.63లక్షలు కేటాయించినప్పటికీ ఇందులో రూ.32.50 లక్షలు మాత్రమే విజయనగరంలోని వర్శిటీకి దక్కాయి. 2022-23 బడ్జెట్ వరకు ఇదే పరిస్థితి. దీంతో, వచ్చిన మొత్తం వర్శిటీ నిర్వహణకే సరిపోని పరిస్థితి. ఈ ఏడాది (2023-24 బడ్జెట్‌లో) మరీ ఘోరంగా రూ.18.50కోట్లు మాత్రమే కేటాయించారు. దీంతో, గాజులరేగ సమీపంలో పాత ఎయు క్యాంపస్‌లో గిరిజనవర్శిటీ తరగతులు నిర్వహిస్తున్నారు. వర్శిటీలో 200మంది విద్యార్థులు ఉన్నారు. కేవలం 12కోర్సులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మరికొన్ని కోర్సుల ఏర్పాటుకు అనుమతులు లభించినప్పటికీ వసతి సమస్య వల్ల ముందుకు సాగలేని పరిస్థితి. ఉన్న డిపార్ట్‌మెంట్లకే భవనాలు, గదులు సరిపోవడం లేదు. 12మంది ఫ్యాకల్టీ ఒకే గదిలో కూర్చోవాల్సివస్తోంది. ఇక విద్యార్థుల సమస్యల గురించి వేరేగా చెప్పనక్కర్లేదు. విజయనగరం జిల్లాలో తలపెట్టిన గిరిజన యూనివర్శిటీ భవన నిర్మాణం విషయంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. దీంతో, అద్దె కొంపలో తరగతులు నిర్వహిస్తున్నారు. వీటిలో లేబొరేటరీ, లైబ్రరీ, ఆటస్థలాలు, జిమ్, పరిశోధనకు అవసరమైన ఇతర సదుపాయాలు లేకపోవడం వల్ల సీతం, ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కాలేజీలు, మాన్సాస్ పరిధిలోని ఎంఆర్ అటానమస్, ఎంఆర్ డిగ్రీ కాలేజీలపై ఆధారపడుతున్నారు.

తరగతులొక చోట, ప్రయోగాలు మరోచోట, పరిశోధనలు ఇంకోచోట జరుగుతుండడంతోవిద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్శిటీకి హాస్టల్ నిర్వహణకు నిధులు ఉన్నప్పటికీ అందుకు తగ్గ భవనం లేదు. దీంతో, సమీపంలోని సీతం కాలేజీ యాజమాన్యంతో ఒప్పందం కుదుర్చుకుని అక్కడ 100మంది విద్యార్థులకు హాస్టల్ సదుపాయం కల్పించారు. మిగిలిన విద్యార్థులు అక్కడ కూడా ఉండేందుకు అవకాశం లేకపోవడంతో ముఖ్యంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు వెనుదిరుగుతున్నారు. జర్నలిజం విభాగంలో గత ఏడాది 18మంది చేరగా వసతి, తరగతి గదులు, లైబ్రరీ, లేబొరేటరీ వంటి సదుపాయాలు లేకపోవడంతో 15మంది ఇతర వర్శిటీలకు వెళ్లిపోయారు. ఇక సెమినార్ హాళ్లు, ఆట స్థలాలు, సెంట్రల్ లైబ్రరీ వంటి సదుపాయాల గురించి వేరేగా చెప్పనక్కర్లేదు. గిరిజన ప్రాంతాలపై పరిశోధనలు అనే మాటే లేదు. దీంతో, గిరిజన వర్శిటీ లక్ష్యం నీరుగారుతోంది. ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ విశాఖపట్నం వచ్చిన సందర్భంగా ఎయిర్‌పోర్టు, గిరిజన విశ్వవిద్యాలయాలకు శంకుస్థాపన చేస్తారని ప్రకటించడంతో ఇన్నాళ్లకైనా మోక్షం కలుగుతుందని చాలా మంది భావించారు. ఆచరణలో అటువంటిదేమీ కనిపించలేదు. తాజాగా భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు పనులకు శంకుస్థాపన చేసేందుకు సిఎం జగన్మోహన్‌రెడ్డి వస్తున్నట్టు ఇటీవల మంత్రులు ప్రకటించినప్పటికీ గిరిజన వర్శిటీ విషయమై మాట్లాడకపోవడంతో విద్యావంతుల్లో తీవ్ర నిరాశ, అసహనం వ్యక్తమౌతోంది. ఇప్పటికైనా భూ సేకరణ పూర్తిచేసి, కేంద్రానికి అప్పగించాలని కోరుతున్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు, సిఐటియు నాయకులు

బకాయి జీతాలు చెల్లించాలి

ప్రభుత్వం ప్రకటించిన రూ.10వేలు జీతం ఇవ్వాలి • కలెక్టరేట్ వద్ద గ్రీన్ అంబాసిడర్ల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బకాయి వేతనాలు చెల్లించి ,ప్రభుత్వం ప్రకటించిన రూ.10వేలు వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రీన్ అంబాసిడర్లు సోమవారం కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున ధర్నా చేశారు. తమ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె .సురేష్, గ్రీన్ అంబాసిడర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడారు. గ్రీన్ అంబాసిడర్లంతా పేద కుటుంబాలకు చెందిన వారని, సంవత్సరాల తరబడి జీతాలు ఇవ్వకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. పస్తులుండి ప్రజల ఆరోగ్య రక్షణకోసం పని చేయమంటారా అంటూ అధికారులను నిలదీశారు. అధికారులు తమ ఆర్థిక ఇబ్బందులను అర్థం చేసుకొని తమ సమస్యలు పరిష్కరించాలనికోరారు. లేదంటే జిల్లా వ్యాప్తంగా విధులు బహిష్కరిస్తామని తెలిపారు. ప్రతినెలా 5వ తేదీలోపు జీతాలు చెల్లించాలని, ప్రభుత్వం 2020లో ఇస్తామన్న రూ.10వేలు జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, కార్మికులకు భద్రత పరికరాలు ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పుమేరకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కార్మికులకు ప్రమాదభీమా 20 లక్షలు సౌకర్యం కల్పించాలని కోరారు. అక్రమంగా తొలగించినవారిని విధుల్లోకి తీసుకోవాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ధర్నా లో సిఐటియు నాయకులు వి.లక్ష్మి, ఎ.జగన్మోహన్, నాగరాజు, అప్పారావు, రమేష్ ,శంకరరావు కార్మికులు పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆర్థిక సాయానికి సర్వే

ప్రజాశక్తి-పూసపాటిరేగ

ఈనెల 15 నుంచి జూన్ 14వరకు సముద్రంలో చేపల వేట నిషేధం నేపథ్యంలో మత్స్యశాఖ ఉపసంచాలకులు ఎన్.నిర్మలా కుమారి ఆధ్వర్యాన మత్స్య శాఖ అభివృద్ధి అధికారి యు. చాందిని, మెరైన్ సిఐ వి. శ్రీనివాస రావు, ఎస్ఐ టి.రమేష్ సోమవారం పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లోని తీర ప్రాంతాలను పరిశీలించారు. సముద్రంలో చేపల వేట లేని కారణంగా జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులకు మత్స్యకార భరోసా పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించేందుకు అన్ని లాండింగ్ సెంటర్లలోనూ మత్స్య శాఖ సిబ్బంది, గ్రామ మత్స్య సహాయకులు, సాగర మిత్రలతో సర్వే నిర్వహించారు. చేపల వేట నిషేధం సందర్భంగా సంతానోత్పత్తి కాలంలో తల్లి చేపలు, రొయ్యలను సంరక్షించడం, వాటి ఉత్పత్తిని పెంచుట ద్వారా మత్స్య సంపద అభివృద్ధి సాధించడం దీని ముఖ్య ఉద్దేశమని అన్నారు. నిషేధ ఉత్తర్వుల ప్రకారం మెకనైజడ్, మోటరైజడ్ బోట్లు సముద్ర జలాలలో చేపల వేట చేయరాదని తెలిపారు. డేటా ఎంట్రీ చేసి అర్హత మేరకు అర్హులైన మత్స్యకారులందరికీ మే రెండో వారంలో ప్రత్యక్ష ప్రయోజన బదిలీ ద్వారా ప్రోత్సాహకం చెల్లిస్తామని తెలిపారు.

గంజాయితో పట్టుబడిన నిందితులు

294 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-శృంగవరపుకోట

రెండు వేర్వేరు చోట్ల ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న 294 కేజీల గంజాయి పట్టుబడినట్లు సిఐ సింహాద్రి నాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని పందిరప్పన్న జంక్షన్ వద్ద కారులో గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో నిఘా పెట్టి 124 కేజీల గంజాయితో పాటు తమన్ జావేద్, సోఫికల్ అబ్దుల్, అజీమ్ అనే ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి నాలుగు మొబైల్ ఫోన్‌లు, 71 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. అరకులో గంజాయిని కొనుగోలు చేసి మహారాష్ట్రలో అమ్మేందుకు తరలిస్తున్నారు. అదే విధంగా పట్టణంలోని దేవిజంక్షన్ వద్ద వాహన తనిఖీ నిర్వహిస్తుండగా కారులో 170 కేజీల గంజాయి లభించింది. దీంతో గంజాయితో పాటు రాజస్థాన్ కు చెందిన బారులాల్, రోషల్ మాలి లతోపాటు రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఫ్యామిలీతో ఉంటే కారును చెకింగ్ చేయకుండా వదిలేస్తారని ఆలోచనతో రెండు ఘటనల్లోను దొరికిన అయిదుగురు వ్యక్తులలో ఒకరు మహిళ కావడం ఆమె మూడేళ్ల బాబు, ఐదేళ్ల పాపతో గంజాయి రవాణా కారులో ఉండడం గమనార్హం. ఇదిలా ఉండగా బొడ్డవరం వద్ద గంజాయి తనిఖీకి చెక్ పోస్టులు ఉన్నప్పటికీ ఆ చెక్‌పోస్టు దాటి పట్టణ పరిసర ప్రాంతాల్లో పట్టు పడడం అనుమానాలకు తావిస్తోంది. గంజాయితో అరకు నుంచి వస్తున్న వాహనాలు మరమ్మత్తులకు గురికావడం వల్లే ఎస్.కోటలో పట్టుబడుతున్నాయని, లేకుంటే దర్జాగా విశాఖపట్నం చేరుకుంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. గంజాయిని పట్టుకున్న వారిలో ఎస్ఐ తారకేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

నిర్ణీత కాలవ్యవధిలో వినతుల పరిష్కారం

స్పందనకు జిల్లా అధికారుల హాజరు తప్పనిసరి : కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన ప్రజా వినతుల పరిష్కారంపై కలెక్టర్ నాగలక్ష్మి జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు. స్పందనలో సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వినతుల పరిష్కారాన్ని అత్యంత ముఖ్యమైన అంశంగా భావించి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు. వారి కిందిస్థాయి అధికారులు, సిబ్బందిని గ్రీవెన్స్‌కు పంపితే అనుమతించేది లేదన్నారు. వారు తప్పనిసరి పరిస్థితుల్లో ఏదైనా ముఖ్యమైన సమావేశానికి వెళ్లాల్సి వస్తే ముందస్తుగా అనుమతి తీసుకోవాలన్నారు. మండల, డివిజన్ స్థాయిల్లో కిందిస్థాయి అధికారులు, సిబ్బంది వినతులు పరిష్కరిస్తున్న తీరుపై జిల్లా అధికారులు శాంపిల్‌గా కొన్ని వినతులు పరిష్కారం జరిగిన విధానాన్ని తనిఖీచేయాలని సూచించారు. నిర్ణీత వ్యవధిలోనే వినతులు పరిష్కారం జరగాలని, ఈ విషయంలో జాప్యాన్ని సహించేది లేదన్నారు. సంబంధిత శాఖకు వినతులు వచ్చిన వెంటనే ఆ వినతిని పరిష్కరించే బాధ్యత ఒక అధికారికి అప్పగించాలన్నారు. సరైన రీతిలో పిటిషన్‌లపై దర్యాప్తు జరగకుండా ఆయా పిటిషన్లు మళ్లీ విచారణ కోసం ఓపెన్ చేసే పరిస్థితి రాకూడదన్నారు. లోకాయుక్త కేసులు, కోర్టు కేసుల్లో సకాలంలో ఆయా శాఖల నుంచి కౌంటర్‌లు దాఖలు చేయాలని ఆదేశించారు.

కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న వికలాంగుడు

మండల ప్రత్యేక అధికారులంతా కొనసాగుతారని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. వారు ఇంతకు ముందు పనిచేసిన మండలాల్లోనే పర్యటించి కార్యక్రమాల అమలును పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్ఒ ఎం.గణపతిరావు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌లు పద్మలీల, బి.సుదర్శన దొర, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్పందనకు 166 వినతులు

కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 166 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి అత్యధికంగా 105 ఉన్నాయి. పింఛన్ల కోసం, రేషన్ కార్డుల జారీ, ఉపాధి కల్పన, ఉపాధి హామీ బిల్లుల చెల్లింపు ఇతర సమస్యలపై మిగిలిన వినతులు అందాయి. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జెసి మయూర్ అశోక్, డిఆర్ఒ గణపతిరావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు పద్మలత, దొర, సూర్యనారాయణ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గంట్యాడ మండలం మదనాపురం గ్రామానికి చెందిన మహిళలు ఇళ్లస్థలాలు రాలేదని వినతినివ్వగా కలెక్టర్ స్పందిస్తూ హౌసింగ్ పీడీని పిలిచి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు . పూసపాటిరేగ మండలం లంకాపల్లికి చెందిన హౌసింగ్ బిల్లు రాలేదని విన్నవించగా బిల్లు వెంటనే పెట్టాలని హౌసింగ్ అధికారులకు సూచించారు.

కలెక్టరేట్ వద్ద నాగు పాము కలకలం

ప్రజాశక్తి-విజయనగరం

కలెక్టరేట్ లో నాగుపాము కలకలం రేపింది. సోమవారం ఉదయం 10గంటల సమయంలో కలెక్టరేట్ లోని డిఇఒ కార్యాలయం ముఖద్వారం వద్ద నాగుపాము కనిపించింది. జనసంచారంతో అది పడగవిప్పడంతో కార్యాలయాలకు వచ్చిన అధికారులు, సిబ్బంది నివ్వెర పోయారు. వెంటనే పాములు పట్టేవారికి సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకున్నారు. పాము దేనినో తినేసి కదలలేని పరిస్థితిలో ఉండడంతో వెంటనే దాన్ని పట్టుకొని ఒక సీసాలో బంధించారు. పామును అటవీశాఖ అధికారులకు అప్పగిస్తామని పాములుపట్టేవారు తెలిపారు. దీంతో అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.



డిఇఒ కార్యాలయం వద్ద పడగవిప్పిన పాము

బెల్టులు పొందిన విద్యార్థులు

తైక్వాండోలో వందమందికి బెల్ట్‌లు

విజయనగరం టౌన్ :కోరుకొండ సైనిక్ స్కూల్‌లో తైక్వాండో బెల్ట్ టెస్ట్ పరీక్ష సోమవారం జరిగింది. ఈ పోటీలలో వంద మంది క్రీడాకారులు పాల్గొని ఎల్లో ,గ్రీన్ ,బ్లూ , బెల్టు లో అర్హత పొందారు. ముఖ్య అతిథిగా వైస్ ప్రిన్సిపల్ వింగ్ కమాండర్ ఎస్.కేశవన్ హాజరయ్యారు. రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ అబ్జర్వర్‌గా ఎం.అచ్చం నాయుడు , ఎగ్జామినర్ సిహెచ్ వేణుగోపాలరావు పాల్గొన్నారు. తైక్వాండో ఇంఛార్జి ముల్లా రఫీక్ పాల్గొని ఎంపికైన క్రీడాకారులకు సర్టిఫికెట్లు బెల్టులు అందజేసి అభినందనలు తెలిపారు. వారికి జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్ వేణుగోపాలరావు అభినందనలు తెలిపారు.

స్పందన ఫిర్యాదులపై తక్షణ చర్యలు

ప్రజాశక్తి-విజయనగరం

స్పందనలో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. బాధితుల సమస్యలను అడిగి తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నెల్లిమర్ల మండలం గాంధీనగర్‌కు చెందిన వ్యక్తి తాను జమ్మునారాయణ పురంలో ఫ్లాట్ కొనుగోలు చేసేందుకుగాను జమ్ము నారాయణపురానికి చెందిన వ్యక్తికి 2019లో రూ. 36లక్షలు చెల్లించానని, ఇప్పటికీ కూడా ఫ్లాట్స్ నిర్మాణం చేపట్టలేదని, న్యాయం చేయాలని కోరారు. గంట్యాడ మండలం గింజేరుకు చెందిన ఒక వ్యక్తి తాను 1998లో అదేగ్రామానికి చెందిన వ్యక్తి వద్ద నుండి 20 ఎకరాల వ్యవసాయ భూమి కొనుగోలు చేసానని, కానీ, ఇంత వరకుసదరు వ్యక్తి తనకు రిజిస్ట్రేషను చేయకుండా కాలయాపన చేస్తున్నాడని, న్యాయం చేయాలని కోరారు. ఎస్‌పి వెంటనే ఆయా సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి వారం రోజుల్లో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, డిసిఆర్‌బి సిఐ జె.మురళీ, ఎస్‌బి సిఐ నర్సింహమూర్తి, డిసిఆర్‌బి ఎస్ఐ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణకు సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్‌పి దీపిక

పోగొట్టుకున్న మొబైల్స్ అందజేత

జిల్లాలో పోగొట్టుకున్న 20 మొబైల్ ఫోన్లను సైబరు క్రైమ్ పోలీసులు రికవరీ చెయ్యగా సోమవారం వాటిని స్పందనలో ఎస్‌పి ఎం.దీపిక బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, సైబర్ క్రైమ్ ఎస్ఐ ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

సిటియుకు సొంత హాస్టల్ కేటాయించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరంలో గల కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో మౌళిక వసతులు కల్పించాలని, సొంత హాస్టల్ కేటాయించాలని కోరుతూ విద్యార్థులు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన బాట పట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కార్యదర్శి బి.లక్ష్మణరావు మాట్లాడుతూ కళాశాలకు సొంత హాస్టల్ సదుపాయం లేక పోవడంతో ప్రయివేటు హాస్టల్‌లో విద్యార్థులు ఉంటున్నారని అన్నారు. అక్కడ మెస్ ఛార్జీలు విద్యార్థులకు భారంగా ఉన్నాయని, భోజనం కూడా సరిగా లేకపోవడంతో విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. యూనివర్సిటీ కి సొంత హాస్టల్ సదుపాయం కల్పించాలని , మెస్ ఛార్జీలు వెంటనే విడుదల చేయాలని , హాస్టల్ ఫీజు తగ్గించాలని కోరారు. విసి అందుబాటులో లేకపోవడంతో ఎఒ ఇచ్చిన హామీతో ఆందోళన విరమించారు. సమస్యలు పరిష్కారం కాకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉమ, దీపిక, మోహన్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

సిటియు ఎఒను ప్రశ్నిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వైద్యాధికారిపై డిప్యూటీ సిఎం ఆగ్రహం

గిరిజన సమస్యలపై స్పందన • గుర్ల ప్రాజెక్టు నిర్మాణానికి అదనపు నిధులకు కృషి

ప్రజాశక్తి- మెంటాడ

గిరిజన రోగులు మెంటాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళితే వైద్యాధికారులు అందుబాటులో ఉండటంలేదని, ఒకవేళ ఉన్నా గజపతినగరం, విజయనగరం ఆసుపత్రులకు రిఫర్ చేసి చేతులు దులుపుకుంటున్నారని గిరిజనులు డిప్యూటీ సిఎం ముందు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆయన మెంటాడ పిహెచ్‌సి వైద్యాధికారి ఎన్ శృతిని పిలిచి ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూసుకోవాలని ఆయన హెచ్చరించారు. ఆంద్ర సచివాలయం పరిధిలో సోమవారం వేపగుడ్డి, కొండజీరికివలస, కుంబివలస, పనసలవలస, ఆంద్ర గ్రామాల్లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సిఎం పాల్గొని మాట్లాడారు. ముందుగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందచేసిన సంక్షేమ పథకాలు అమలు తీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కుంబివలసలో గిరిజనులు ఆయనకు సమస్యలను చెప్పారు. గుర్లగెడ్డ ప్రాజెక్టు నిర్మాణం కోసం అదనపు నిధులు మంజూరు చేయాలని కౌలు రైతులు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాకోటి రాములు, గుర్ల గ్రామస్థులు ఆయనకు వినతి పత్రం అందజేశారు. అదనపు నిధులకు కృషి చేస్తానని ఆయన చెప్పారు. గిరిజనలు తమకు రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని, సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని విన్నవించుకున్నారు. అనంతరం సుమారు 15కుటుంబాలు వైసిపి తీర్థం పుచ్చుకున్నాయి. ఆంద్ర సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హాయాంలో సంక్షేమ ఫలాలు నిరుపేదలకు అందేపరిస్థితి లేదన్నారు. తమ ప్రభత్వ పాలనలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపిపిలు సారిక ఈశ్వరరావు, పొట్టంగి దుర్గ, గ్రామ సర్పంచ్ వాకపల్లి లక్ష్మి, నాయకులు లెంక రత్నాకర్ నాయుడు, దాట్ల హనుమంతురాజు, సిరిశెట్టి నారాయణరావు, కుంచు తిరుపతి నాయుడు, తహశీల్దార్ యు. ఆదిబాబు, ఎంపిడిఒ పి. త్రివిక్రమ్ రావు, హౌసింగ్ ఎఇ డేవిడ్, ప్రసన్న కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్‌లు సతీష్, సన్యాసిరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి వైద్యరాలితో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

మల్లంపేటలో అత్యవసర పనులకు నిధులు

బొబ్బిలి : మల్లంపేట గ్రామదేవత పండుగ నేపథ్యంలో అత్యవసర పనులకు నిధులు మంజూరు చేసినట్లు మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఈ నెల 24,25,26న మల్లంపేట పండుగ జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు, భక్తులు ఇబ్బందులు పడకుండా అత్యవసర పనుల కోసం నిధులు మంజూరు చేశామన్నారు. రెండు కాలువలు నిర్మాణానికి రూ.2లక్షలు, సీసీ రోడ్డు నిర్మాణానికి 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.5లక్షలు, మల్లంపేట నుంచి రామన్నదొరవలస రోడ్డుకు రూ.4లక్షలు, ఎస్సీ కాలనీ బైపాస్ రోడ్డుకు రూ.1.50లక్షలు, శ్రీకొత్తపోలమ్మతల్లి ఆలయానికి రోడ్డు వేసేందుకు రూ.1.50లక్షలు కేటాయించినట్లు చెప్పారు. కుళాయి లేని ప్రాంతాలకు మంచినీటి ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేస్తామన్నారు. గ్రామంలో వీధి దీపాలు నూతనంగా ఏర్పాటు చేస్తామన్నారు.

19న ఉపకరణాల గుర్తింపు శిబిరం

నెల్లిమర్ల : ఈనెల 19న వికలాంగుల ఉపకరణాల గుర్తింపు కార్యక్రమం జరుగుతుందని ఎంపిడిఒ జి. గిరి బాల, ఎంఇఒ అంబళ్ళ కృష్ణారావు తెలిపారు. సోమవారం వారు మండల పరిషత్తు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ఆ రోజు డెంకాడ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వికలాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరం నిర్వహిస్తున్నారు. విభిన్న ప్రతిభా వంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న శిబిరంలో అర్హులైన వారు ఉపకరణాల కోసం సదరం సర్టిఫికెట్, ఆధార్, రేషన్ కార్డు, ఆదాయ ధృవ పత్రం, 2పాస్ ఫోటోలు తీసుకుని రావాలని సూచించారు.

గురుకులంలో ప్రవేశ పరీక్షకు హాల్ టిక్కెట్లు

వేపాడ : మండలంలోని బక్కునాయుడుపేట వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో 5వతరగతి, జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు ఈనెల 23న ఆదివారం ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ ఉషారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించిన హాల్ టిక్కెట్లు మంగళవారం నుంచి http://apgpcet.apcfsc.in వెబ్ సైట్లో హాల్ టిక్కెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. హాల్ టిక్కెట్లో ఫోటో సరిగా లేకపోతే కళాశాల ప్రిన్సిపల్తో సంతకం చేయించి కోవాలని, పరీక్షలు ఓఎంఆర్ విధానంలో ఉంటుంది కాబట్టి బ్లు లేదా బ్లాక్ పెన్తో మాత్రమే రాయాలని, పరీక్షకు 30 నిమిషాలు ముందుగా హాజరు కావాలని కోరారు.

తప్పుడు ప్రచారాలకు కేరాఫ్ అడ్రస్ వైసిపి

నెల్లిమర్ల : ఫేక్ ప్రచారాలకు, అసత్యాలకు, పోర్జరీలకు వైసిపి ప్రభుత్వం కేరాఫ్ అడ్రస్గా మారిపోయిందని టిడిపి విజయనగరం మహిళా పార్లమెంటరీ అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలోనూ చంద్రబాబు నాయుడు, లోకేష్ పై తప్పుడు వార్తలు ప్రచారం చేసి దొరికిపోయిన దొంగలు వైసిపి పేటిఎం బ్యాచ్ అని విమర్శించారు. వైసిపి అబద్ధాల ఫ్యాక్టరీగా తయారయ్యిందని దీని చైర్మన్గా జగన్ రెడ్డి వ్యవహరిస్తున్నాడని చెప్పారు. వైసిపి పేటియం బ్యాచ్ ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మరని వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలిపించి వైసిపిని రాష్ట్రం నుంచి తరిమేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

మజ్జిగ, మంచినీరు పంపిణీ

శృంగవరపుకోట: పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం అధికారి షేక్ మదీనా ఆధ్వర్యంలో అగ్నిమాపక కేంద్రం సిబ్బంది పాదచారులు, ప్రయాణికులకు మజ్జిగ, మంచినీరు సోమవారం పంపిణీ చేశారు. అధిక ఎండలను దృష్టిలో పెట్టుకుని ఫైర్ సిబ్బంది తమ కార్యాలయం ఎదుట విశాఖ–అరకు ప్రధాన రహదారిలో చలివేంద్రం ఏర్పాటు మజ్జిగ, మంచినీరు అందిస్తున్నారు.

ఆధార్ అప్డేట్ పై అవగాహన

వేపాడ : మండలంలోని సింగరాయ గ్రామ సచివాలయంలో పంచాయతీ సిబ్బందికి ఆధార్ కార్డు అప్డేట్ నమోదు చేయడంపై ఇఒపిఆర్డి సూర్యనారాయణ సోమవారం సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆధార్ అప్డేట్ చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు గురించి వివరించి ఈనెల 18,19 తేదీల్లోగా ఆధార్ అప్లోడ్ పనులు పూర్తి చేయాలని సూచించార. ఈ అవగాహన సదస్సులో వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, ఏఎన్ఎం, వ్యవసాయ సహాయకురాలు, మహిళా కానిస్టేబుల్ పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం : సిపిఎం

కొత్తవలస: దేశ ప్రజలను విచ్ఛిన్నం చేసే బిజెపి అనుసరిస్తున్న మనువాధానికి వ్యతిరేకంగా, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని సిపిఎం పార్టీ నాయకులు గాడి అప్పారావు అన్నారు. సోమవారం కొత్తవలసలో సిమెంట్ రోడ్డు, మంగళ వీధి ప్రాంతాల్లో ప్రచార భేరీపై ప్రచారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో మనువాద సిద్ధాంతాలను అమలు చేయడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. దీన్ని యావత్తు భారత ప్రజానీకం తిప్పుకొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పూడి అప్పలరాజు, హేమాలు ఈశ్వరమ్మ, లక్ష్మి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

పాలకొరతపై ఎందుకు సమాచారం లేదు : ఎమ్మెల్సీ

శృంగవరపు కోట : గత 20 రోజులుగా ఎస్కోట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ఎస్.కోట, జామి మండలాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో గత 20 రోజుల నుండి పాలు కొరత ఏర్పడి పిల్లలకు పాలు పంపిణీ కావడంలేదన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సోమవారం పట్టణంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సిబ్బందిని పాల కొరంతపై అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పాలు, గుడ్లు లాంటి పోషక పదార్థాల కొరత వచ్చే పరిస్థితి ఏర్పడినపుడు వెనువెంటనే ఉన్నతాధికారులకు తెలియజేసి, అదే విషయాన్ని ప్రజా ప్రతినిధుల దృష్టిలో పెట్టాలని సూచించారు. పాలు సరఫరా కాని పరిస్థితిని జిల్లా అధికారులతో చర్చించి పాలకొరత తీరేలా చూస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శేష బాబు. ఇఒపిఆర్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయానికి వితరణ

భోగాపురం : నెల్లిమర్ల మండలం పెద్దతరిమి గ్రామంలోని శ్రీశ్రీశ్రీ ఆంజనేయస్వామి విగ్రహం నిర్మాణం కోసం టిడిపి నియోజకవర్గం ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు రూ.50వేలు వితరణ అందించారు. పోల్లిపల్లిలోని ఆయన స్వగృహంలో సోమవారం ఆ ఆలయ కమిటీ సభ్యులకు అందించారుఉ. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మొంగం శ్రీనివాసరావు, పైడి మల్లేశ్, పైడి అప్పన్న, మొంగం వెంకటేష్, పైడి సూరిబాబు, పైడి వెంకటేష్, పడాల వెంకటరావు, తిరుమరెడ్డి సోమశేఖర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సిటియులో వర్క్షాప్

విజయనగరం టౌన్ : నూతన విద్యా విధానానికి అనుగుణంగా, ఇంజినీరింగ్ విభాగాలకు హిందీ, ప్రాంతీయ భాషలలో వివిధ సబ్జెక్టులలో పదకోశం రూపొందించడానికి ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం పూనుకుంది. 'ఫండమెంటల్ గ్లాసరీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ (ఇంగ్లీష్–హిందీ–తెలుగు)' అంశంపై జాతీయ విద్యా మంత్రిత్వ శాఖ సారధ్యంలోని కమిషన్ ఫర్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలజీ (సిఎస్టిటి) సహకారంతో ఐదు రోజుల వర్క్షాప్ ని సోమవారం విశ్వవిద్యాలయంలోని సెమినార్ హాల్లో ప్రారంభించారు. ఈ వర్క్షాప్లో 2850 ఇంగ్లీష్–హిందీ పదాలకు తెలుగులో అర్థాలను రూపొందించబోతున్నారు. ఈపదాల రూపకల్పనలో పలు కేంద్రీయ విశ్వవిద్యాలయాలు నిపుణుల సహకారం తీసుకున్నారు. కార్యక్రమంలో సిఎస్టిటి తరపున జై సింగ్ రావత్ పాల్గొని ప్రధానోపన్యాసం చేశారు.

పత్రాలు ఇచ్చారు.. స్థలాలేవి?

● ఇళ్ల స్థలాలు చూపించాలని లబ్ధిదారులు ఆందోళన ● తహశీల్దార్ కార్యాలయం ముట్టడి ● ఆందోళనకు టిడిపి మద్దతు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రెండేళ్ల క్రితం పేదలకు జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని చెప్పి 1500 మందికి ఇంటి పత్రాలను అందించారు. కానీ ఇందులో చాలా మందికి ఇప్పటి వరకూ ఇళ్ల స్థలాలు చూపించలేదని లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. ఇందులో భాగంగా టిడిపి పట్టణ అధ్యక్షులు బైరెడ్డి లీలావతి, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు ఆధ్వర్యంలో సోమవారం లబ్ధిదారులంతా ఆందోళనకు దిగి తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, లబ్ధిదారులు మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు 2సంవత్సరాలు క్రితం ఇళ్ళు పట్టాలు ఇచ్చింది గాని ఇంతవరకు స్థలం చూపించకపోవడం దారుణమన్నారు. ముఖ్యంగా నగర పంచాయతీ పరిధిలో1500మంది పేదలను ఇళ్ల స్థలాలు కోసం ప్రభుత్వం గుర్తించిందని కొంతమందికి ఇళ్ల స్థలాలు చూపించి నిర్మాణం చేపట్టి మరికొంత మందికి స్థలం చూపించకుండా రిజిస్ట్రేషన్ పత్రాలు ఇచ్చి చేతులు దులుపుకోవడం జరిగిందన్నారు. ఎటువంటి సౌకర్యాలు లేని కొండ ప్రాంతంలో స్థలం చూపిస్తే సౌకర్యాలు లేని ప్రాంతంలో ఇల్లు ఎలా నిర్మాణం చేస్తారని ప్రశ్నించారు. పలుమార్లు అధికార్లు, ప్రజా ప్రతినిధుల దృష్టికి ఇళ్ల స్థలాల సమస్య తీసుకు వెళ్తే లబ్ధిదార్లకు అనుకూలంగా ఉన్న ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి 2సంవత్సరాలు గడిచినా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ, హౌసింగ్ అధికారులను ఇళ్ల స్థలాలు కోసం అడిగితే అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికార్లు పత్రాలు ఇచ్చిన పేదలకు ఇళ్ళు స్థలాలు చూపించి న్యాయం చేయాలని కోరారు. స్థలాలు చూపించకపోతే పార్టీ తరపున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్, నగర పంచాయతీ కమిషనర్కు వినతి పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నరవ రామ లక్ష్మీ, నాయకులు కె. కన్నం నాయుడు, కాళ్ళ రాజ శేఖర్, రాజగిరి వాసు, ఈపి మీనాక్షి, బైరెడ్డి కళ్యాణ్, శంకర రావు, పాల్గొన్నారు.

అధికారికి వినతి పత్రాన్ని ఇస్తున్న టిడిపి నాయకులు

బొబ్బిలిలో గడపగడపకు..

బొబ్బిలి : బొబ్బిలి మున్సిపాలిటీలోని 6వ సచివాలయ పరిధిలో గల 11వ వార్డులో సోమవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పాల్గొని అర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా అని అడిగారు. ప్రతి గడప వద్దకూ వెళ్లి ప్రభుత్వం ముద్రించిన బుక్లెట్ను లబ్ధిదారులకు అందజేసి మూడేళ్లలో వారికి అందించిన పథకాలను వివరించారు.

మహిళలకు టైలరింగ్ శిక్షణ

శృంగవరపుకోట: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకే మహిళలకు టైలరింగ్ శిక్షణ కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. సోమవారం పట్టణంలోని మండల మహిళా సమాఖ్య వెలుగు కార్యాలయంలో నిర్వహిస్తున్న మహిళలకు టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన భారత్ లిమిటెడ్ ఎండి, ఎస్వి కామేశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా టైలరింగ్లో శిక్షణ పొందుతున్న మహిళలతో వారు మాట్లాడారు.

మత సామరస్యాన్ని కాపాడాలని వినతి

ఆర్డిఒకు వినతినిస్తున్న ఫెలోషిప్ అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి - బొబ్బిలి

ఎన్నో సంవత్సరాలుగా హిందూ, ముస్లిం, క్రైస్తవులందరూ అన్నదమ్ముల్లా నివసిస్తున్న బొబ్బిలి ప్రాంతంలో, కొంతమంది బయట వ్యక్తులు వచ్చి మతసామ్రస్యాన్ని పాడు చేయాలని, రకరకాల వ్యాఖ్యలు చేస్తున్నారని బొబ్బిలి పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మతసామ్రస్యాన్ని కాపాడాలని కోరుతూ ఆర్డిఒ శేషశైలజకు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాధా మనోహర్ దాస్ అనే వ్యక్తి, గత కొద్ది రోజుల క్రితం బొబ్బిలి వచ్చి వేణుగోపాల స్వామి ఆలయం వద్ద కొంతమందితో మాట్లాడుతూ, యేసు క్రీస్తు గురించి, క్రైస్తవుల నమ్మకాల గురించి చాలా అసభ్యకరంగా మాట్లాడారన్నారు. క్రైస్తవుల మనోభావాలను దెబ్బతీసే విధంగా, వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బొబ్బిలిలో మంచి వాతావరణం ఉందని, అందరూ కలిసిమెలిసి ఎంతో సంతోషంగా జీవిస్తున్నామని,ఈ మధ్యకాలంలో కొంతమంది క్రిస్టియన్, ముస్లిం వర్గాలపై రకరకాల వ్యాఖ్యలు చేస్తూ వారి మనోభావాలను దెబ్బతీసే విధంగా మితిమీరి మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే, వైసిపి మండల అధ్యక్షులు వేణుగోపాలనాయుడు, టిడిపి నియోజకవర్గం ఇంఛార్జి బేబినాయన, తహశీల్దార్ నమ్మి రాజారావుకు, సిఐ ఎం. నాగేశ్వరరావుకు వినతి పత్రాలు సమర్పించారు. క్రైస్తవుల మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడిన రాధా మనోహర్ దాస్ అనే వ్యక్తిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఖండించిన బొబ్బిలి ఎమ్మెల్యే

ఏసుక్రీస్తును, క్రైస్తవులను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన రాధా మనోహర్ దాస్ అనే వ్యక్తి మాటలను ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ముక్తకంఠంతో ఖండించారు. ఏ మతస్తులైనా ఇతర మతస్తులను కించపరిచే విధంగా మాట్లాడకూడదని, ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. చట్ట ప్రకారం అటువంటి వారిపై తప్పకుండా చర్యలు తీసుకునేటట్లు అధికారులకు తెలియజేస్తానని ఈ సందర్భంగా మాటిచ్చారు. కార్యక్రమాల్లో బొబ్బిలి పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు సిహెచ్ జయరాజు, గౌరవ అధ్యక్షులు అదృష్ట కుమార్, సెక్రెటరీ జాన్ బాబు, ఉపాధ్యక్షులు పి.గోపాల్, ట్రెజరర్ పిటి నాయుడు, సీనియర్ సభ్యులు బొత్స శాంసన్(రామారావు), ప్రేమనగర్ శాంసన్, బి అశోక్, కె కామేశ్వరరావు, ఎస్ డేనియల్, కె ఇశ్రాయేలు, తదితరులు పాల్గొన్నారు.


పురస్కారం అందుకుంటున్న చైర్మన్

'లెండి' చైర్మన్కు తెలుగురత్న పురస్కారం

డెంకాడ : తెలంగాణా అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా, జయహో భారతీయం సంయుక్తంగా నిర్వహించిన తెలుగు ఉగాది సంబరాలలో లెండి కళాశాల చైర్మన్ పి. మధుసూదనరావుకు తెలుగురత్న పురస్కారం లభించింది. ఈ మేరకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆయనకు నిర్వాహుకులు పురస్కారాన్ని అందించి సత్కరించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వివి రామారెడ్డి సోమవారం తెలిపారు. సమాజ సేవ, కళలు, విద్యా రంగాల్లో నిబద్ధతతో కూడిన వ్యవహార శైలిని పునుకుపుచ్చుకున్న ప్రముఖులకు ఏటా ఈ అవార్డులు ప్రధానం చేస్తారని, ఈ ఏడాది తమ కళాశాల చైర్మన్ను ఈ అవార్డు వరించినందుకు ఎంతో ఆనందంగా ఉందని ఆయన అన్నారు. మొదటినుండి విలువల తో కూడిన విద్యాభ్యాస వ్యవస్థ తమ సంస్థలో వుందని ఆ సందర్భంగా గుర్తుచేశారు. ఈ మేరకు సంస్థ వైస్ చైర్మన్ పి శ్రీనివాసరావు, సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ కె. శివరామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిబాబు, ఎవి పరాంకుశం, ప్లేస్ మెంట్ డీన్ జి ప్రకాష్ బాబు, అన్ని విభాగాల అధిపతులు, డాక్టర్ రాజన్ బాబు, డాక్టర్ రామారావు, డాక్టర్ రాజేంద్ర, డాక్టర్ సుబ్బరామయ్య, డాక్టర్ దుర్గా శైలజ, సతీష్, అధ్యాపక బృందం ఆయనకు అభినందంలు తెలిపారు.

అవకతవకలపై గ్రీవెన్స్లో ఫిర్యాదు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవకతవకలపై కలెక్టర్ గ్రీవెన్స్లో సోమవారం నెల్లిమర్ల మండల జనసేన అధ్యక్షులు పతి వాడ అచ్చుంనాయుడు ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుషిని పంచాయతీ పరిధిలోని చనమల్లుపేట గ్రామంలో గోవిందరాజు చెరువులో జరిగిన ఉపాధి హామీ పనుల్లో సుమారు రూ.7.80 లక్షలు వైసిపి నాయకులు అవకతవకలకు పాల్పడ్డారన్నారు. ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకురావడంతో కలెక్టర్ గ్రీవెన్స్లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ అవకతవకలపై అధికారులు దృష్టి సారించి దోపిడీ దారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కాగా జనసేన ఆ గ్రామ ప్రజలకు అండగా ఉంటుందని అచ్చుంనాయుడు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో జన సేన ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ తమ్మి లక్ష్మి రాజు, డెంకాడ మండల అధ్యక్షులు పతివాడ కృష్ణవేణి, దుర్గాసి శేఖర్, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమాల వివరాలను వెల్లడిస్తున్న జనసేన నాయకులు పతివాడ

చెరువు ఆక్రమణ పై చర్యలు తీసుకోండి

పూసపాటిరేగ : మండలంలోని కోనాడ గ్రామంలో ఊర చెరువు ఆక్రమణ పై అధికారులు చర్యలు తీసుకోవాలని జనసేన మత్స్యకార విభాగం నాయకులు కారి అప్పలరాజు గ్రీవెన్స్లో సోమవారం ఎంపిడిఒ రామారావుకు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబరు 50లో సుమారు 12 ఎకరాల ఊర చెరువు ఉందని చెరువుని కొంత ఆక్రమించి గతంలో సరుగుడు మొక్కలు వేసుకున్నారని ఈ విషయమై గతంలో అధికారులకు ఫిర్యాదు చేస్తే వెంటనే వాటిని తొలగించారని చెప్పారు. తాజాగా అదే చెరువును మరి కొంతమంది ఆక్రమణకు పాల్పడుతున్నారని ఈ విషయమే అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి చెరువును కాపాడాలని కోరారు. సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ వారికి తెలిపారు.

భవన నిర్మాణాలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మండలంలోని కొండకరకాం గ్రామంలో రూ.72లక్షలతో చేపట్టిన గ్రామ సచివాలయ అదనపు భవనం, వెల్నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రాన్ని సోమవారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి మామిడి అప్పలనాయుడు, వైసిపి నాయకులు నడిపేన శ్రీనివాసరావు విలేకర్లతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జొన్నవలస పిఎసిఎస్ అధ్యక్షులు కెల్ల త్రినాద్, సర్పంచ్ కిలారి రమ్య, కిలారి రాంబాబు, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ

భారత మాజీ వాయు సైనికుడు, ఉపాధ్యాయుడు బొడ్డేపల్లి రామకృష్ణారావు 175వ సారి రక్తదానం చేస్తూ జాతీయస్థాయిలో రికార్డు సృష్టించబోతున్న సందర్భంగా మే 1న పట్టణంలోని రెవెన్యూ హోంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు సోమవారం ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీర భద్రస్వామి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు, సాగి నారాయణ రాజు, బొడ్డేపల్లి రామకృష్ణారావు, ఎన్వివిఎస్ బ్లడ్ బ్యాంక్ డైరెక్టర్ టి. నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తత అవసరం

శృంగవరపుకోట: అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక అగ్నిమాపక కేంద్రం అధికారి షేక్ మదీనా అన్నారు. జాతీయ అగ్రిమాపక వారోత్సవాలులో భాగంగా సోమవారం మండలంలోని వెంకటరమణ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అగ్ని ప్రమాదాలు సంభవించునపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, నివారణ పద్ధతులు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, వెంకటరమణపేట గ్రామ ప్రజలు, పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెయింట్ అన్స్ పాఠశాలలో ఫైర్ వారోత్సవాలు

కొత్తవలస: స్థానిక సెయింట్ ఆన్స్ పాఠశాలలో ఫైర్ వారోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఫైర్ ఎస్ఐ వై.అశోక్ కుమార్, శారదా కర్మాగారం ఫైర్ అధికారి పద్మాకర్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో ఫైర్ సిబ్బంది విన్యాసాలు చేయించారు. అగ్ని ప్రమాదంలో చిక్కుకున్నప్పుడు ఏ విధంగా బయటపడాలో విద్యార్థులకు సిబ్బంది చేసి చూపించారు.

ముందుకు రావాలి

విజయనగరం టౌన్ : నగరంలో ఎండ తీవ్రత అధికమవుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలను విరివిగా ఏర్పాటు చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు, ఔత్సాహికులు ముందుకు రావాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్ శ్రీ రాములనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లయితే ఆయా కేంద్రాలకు అవసరమైన తాగునీటిని వాటర్ ట్యాంకర్ల ద్వారా తామే అందిస్తామని తెలిపారు. దాతలు, వాణిజ్య సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు నగరవాసులకు మరింత సౌకర్యార్థమై మజ్జిగ కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తే మంచిదన్నారు.

జీవామృతంతో మేలు

విజయనగరం : విజయనగరం మండలం సారిక పంచాయతీలో గల రైతులకు ఒడిస్సా రాష్ట్రం లోని పర్లాకిమిడికి చెందిన సెంచూరియన్ యూనివర్సిటీ అగ్రికల్చరల్ బిఎస్సి విద్యార్థులు అవగాహన కల్పించారు. జీవామృతం వాడడం వలన పంటలకు ఎంతో మేలు కలుగుతుందని తెలిపారు. పంట దిగుబడి లో ఎంతో సహకరిస్తుందని, దీనిపై దృష్టి పెట్టాలని చెప్పారు. పంటలో వ్యాధులు,వాటి నివారణ అధిక దిగుబడులు తీసుకునే చర్యలను విద్యార్థులు వివరించారు.

ఇద్దరు నిందితులు అరెస్టు

విజయనగరం : పట్టణంలోని బాబామెట్టలో ప్రభుత్వ బాలికల పాఠశాల వద్ద పిల్లలకు బిస్కట్స్, చాక్లెట్స్ అమ్ముతున్న మహిళ మెడలో నుండి రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడును తెంపుకొని పోయిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని రెండో పట్టణ సిఐ సిహెచ్ లక్ష్మణరావు తెలిపారు. వారి వద్ద నుంచి రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడు, పల్సర్ బైక్ను స్వాధీనం చేసుకున్నామని ఈ మేరకు పోలీసు స్టేషన్లో సోమవారం ఆయన వివరాలను వెల్లడించారు. ఆదివారం బాబామెట్ట ప్రభుత్వ బాలికల పాఠశాల వద్ద పిల్లలకు బిస్కెట్స్, చాక్లెట్స్ విక్రయించే మహిళ వద్దకు ఇద్దరు వ్యక్తులు పల్సర్ బైకు మీద వచ్చారు.ఆమె మెడలోని రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడును తెంపుకొని పరారయ్యారు. సోమవారం ఎస్ఐ షేక్ శంకర్, పోలీసు బృందం దాసన్నపేట వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా, నిందితులు పల్సర్ బైకు మీద వస్తూ, వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి, పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని పట్టుకొని ప్రశ్నించగా తమది శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కుప్పిలి గ్రామమని తమ పేర్లు అలుపున నిఖిల్ రెడ్డి, అలుపున రెడ్డి అని తెలిపి, తాము చెడు వ్యసనాలకు అలవాటు ఈ దొంగతనానికి పాల్పడినట్లు నేరం అంగీకరించారు. వారిద్దరిని రిమాండుకు తరలించామని సిఐ తెలిపారు.ఎస్ఐ షేక్ శంకర్, ఎఎస్ఐ వై. పైడితల్లిని సిఐ అభినందించారు.

ఇసుక లారీ పట్టివేత

గుర్ల : ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నం లారీని గుర్ల ఎస్ఐ హరిబాబు నాయుడు సోమవారం పట్టుకున్నారు. ఇటీవల ' రాత్రులు నాటుబళ్లతో సేకరణ.. పగలు లారీలతో రవాణా.. అనే కథనం ప్రజాశక్తిలో వెలువడింది. దీనిపై స్పందించిన పోలీసులు చంపావతి నది నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని కొత్తపేట కూడలి వద్ద అడ్డుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

నేరాలు ఘోరాలు

ఆటో డ్రైవర్పై దాడి

గాయపడిన ఆటో డ్రైవర్

డెంకాడ : మండలంలోని విజయనగరం నాతవలస రహదారిలో పెదతాడివాడ సమీపంలో మానస ఆసపత్రి వద్ద ఆదివారం రాత్రి డెంకాడ నుంచి విజయనగరం వెళ్తున్న ఆటోని డెంకాడ యువకులు అడ్డగించి ఆటో డ్రైవర్ను రక్తం వచ్చేటట్లు కొట్టి అతను వద్ద నుంచి సెల్ ఫోను, నగదు, దౌర్జన్యంగా లాక్కున్నారు. బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం పూలబాగ్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ సురపతి సూర్యనారాయణ తన ఆటోతో ముక్కాం వెళ్లి తిరిగి తన స్వగ్రామానికి చేరుకునే సమయంలో మార్గమధ్యంలో పెదతాడివాడ సమీపంలో మండల కేంద్రానికి చెందిన ఆరుగురు యువకులు ఆటోను అడ్డగించి డ్రైవర్ని బెదిరించి తనని కొట్టి అతని వద్ద ఉన్న విలువైన వస్తువులను దోచుకున్నారు. ఆటో డ్రైవర్ కేకలు వేయగా సమీప ఆస్పత్రిలో ఉన్న సిబ్బంది వచ్చేటప్పటికి యువకులు పారిపోయారు. ఆటో డ్రైవర్కి ఆసుపత్రిలో వైద్య సేవలు చేసి విజయనగరం జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహేష్ బోర అశోక్, ఎం. రవి, గొడ్డు రాజు, గొర్లె బంగారరాజు, గొలుసు సాయికుమార్, మరో బాలుడు ఆరుగురు యువకులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టుకి తరలించారు. వీరి వద్ద నుంచ రెండు మోటారు సైకిళ్లు, సెల్ఫోన్, రూ.2500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT VIZIANAGARAM
M.O.P.No.313/2021

Between:
Sheik Shabhi being minor represented by his mother and natural guardian Sheik Muntaz ......Petitioner
And:
Kolli Srinivasa Rao and others...Respondents
To
The 2nd Respondent
A.Santosh Kumar, S/o Ramana, Hindu, aged about 47 years, owner of Bolero Van bearing No.AP 35 V 6530, residing at B.T.R.Colony, Gajularega, Vizianagaram Mandal and District.

Take notice that the above petition filed by the petitioner under section 166 of M.V. Act for grant of compensation and the said case is stands posted **05-05-2023 at 10:30 A.M** before the above Court for your appearance, failing which the matter will be decide in your absence.

G. Venkata Naidu
Advocate for the Petitioner
Therlam, Vizianagaram Dist

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT VIZIANAGARAM
M.O.P.No.310/2021

Between:
Sheik Muntaz ...Petitioner
And:
Kolli Srinivasa Rao and others ...Respondents
To
The 2nd Respondent
A.Santosh Kumar, S/o Ramana, Hindu, aged about 47 years, owner of Bolero Van bearing No.AP 35 V 6530, residing at B.T.R.Colony, Gajularega, Vizianagaram Mandal and District.

Take notice that the above petition filed by the petitioner under section 166 of M.V. Act for grant of compensation and the said case is stands posted **11-05-2023 at 10:30 A.M** before the above Court for your appearance, failing which the matter will be decide in your absence.

G. Venkata Naidu
Advocate for the Petitioner
Therlam, Vizianagaram Dist

BEFORE THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
Succession O.P. No. 3/2023

Between:
1) Smt. Devadula Krishnaveni, W/o late Koteswara Swamy, Hindu, aged 65 years, resident of D.No.24-1-44, Sunkari Veedhi, Vizianagaram-535 002
2) Smt. Devadula Rajyalaxmi Purnima, W/o. Teki Ramesh, Hindu, aged 40 years - rest do -
3) Sri Devadula Guna Vardhan, S/o. late Koteswara Swamy, Hindu, Ayrvedic Doctor, aged 38 years, - rest do
4) Smt. Devadula Arudra Kumari W/o. C. Pancha Mukesh, Hindu, aged 36 years, - rest do
5) Smt.Devadula Sridevi, W/o late Sridharacharyulu, Hindu, aged 49 years, resident of D No. 184, MIG-1, Phase -2, Vuda Colony, Viziaianagaram Bit -2, Vizianagaram – 535 003
6) Mr. Devadula Vignesh, S/o. Late Sridharacharyulu, Hindu, aged 14 years Minor reptd., by his mother Smt. Devadula Sridevi, - rest do...PETITIONERS

And:
NIL .....RESPONDENTS

GENERAL PUBLIC NOTICE

Whereas above named Petitioners filed the above SOP No.3/2023 in the above Hon'ble Court for issuance of SUCCESSION CERTIFICATE declaring them as the Legal Heirs of Late Devadula Koteswara Swamy and Late Devadula Sridharacharyulu and that the Petitioners are entitled to get transmission of 2400 Shares of VEDANTA Ltd., in their name.

So anybody having any objection or claims in the above matter, they have to appear before the Hon'ble Senior Civil Judge court Vizianagaram on **10-05-2023 at 10.30 am** eighter in person or through an advocate, else the matter will be decided as per law.

P. V. Ganesh, Advocate,
1st Lane, Kothagraharam,
Vizianagaram

మహారాజశ్రీ ఒకటవ అదనపు జిల్లా జడ్జివారి కోర్టు, విజయనగరంలో
(F.D.I.A. 1/2022) FDIA 531/2022, OS 12/2009

Between:
బొడ్డకాయల రమణమ్మ .....పిటిషనరు/వాది
And :
సూరెడ్డి అప్పారావు (died) వగైరాలు
......రెస్పాండెంట్లు/ప్రతివాదులు

3వ రెస్పాండెంటునకు నోటీసు

R3 శ్రీ లగుడు సన్యాసినాయుడు, S/o సూర్యనారాయణ, R/o జామి గ్రామము మరియు మండలం, విజయనగరం జిల్లా.

తే 11-06-2018దిని పై కోర్టువారు O.S. నెం:12/2009రులో తీర్పులో జారీ కాబడిన ప్రిలిమినరీ డిక్రీ ననుసరించి, ఇందలి పిటీషనర్కు ఫైనల్ డిక్రీ జారీ చేయింపించమని దాఖలు చేసిన ఈ పిటీషనులో 3వ రెస్పాండెంటుగానున్న మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని **తే 03-05-2023దిని ఉదయం గం॥ 10-30ని॥**లకు హాజరయి, మీకు ఆక్షేపణలున్న శ్రీ కోర్టువారికి మనవి చేసుకొనవలసినది. లేనియెడల సదరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మాణము చేయుదురని తెలియజేయడమైనది.

CH.D. రామమోహనరావు
పిటిషనరు తరుపు అడ్వకేటు,
D.No: 8.81/1-55
ప్రదీప్నగర్, విజయనగరం

పత్రికా ప్రకటన నోటీసు
మహారాజశ్రీ గజపతినగరం జూనియర్ సివిలు జడ్జివారి కోర్టులో
I.A. 42/2023 in O.S.47/2017

బిట్వీన్ :
కొల్లి రాములమ్మ ....వాది/పిటిషనరు
మరియు :
కొల్లి రామమూర్తి (died) మరి 6గురు
....ప్రతివాదులు/రెస్పాండెంట్లు
To
R5. శ్రీమతి కొల్లి సింహాచలం W/o లేటు రామమూర్తి, హిందూ, 64సం॥, గృహకృత్యయులు, పోలవంగర గ్రామం, దత్తిరాజేరు మండలం, విజయనగరం జిల్లా.
R6. శ్రీ కొల్లి అప్పారావు S/o లేటు రామమూర్తి, హిందూ, 45సం॥, వ్యవసాయం, పోలవంగర గ్రామం, దత్తిరాజేరు మండలం, విజయనగరం జిల్లా.

పై దావాలో వాది దావా పరిహారం సవరణలు చేయుటకు అనుమతి కోరుచూ కోర్టువారి ఎదుట పై నెంబరు పిటిషను దాఖలు చేయుటయు, కోర్టువారు మీకు నోటీసులను పలుమార్లు పంపినప్పటికీ తప్పించుకొని తిరుగుచున్నందున శ్రీ కోర్టువారు పత్రికా ప్రకటన ద్వారా నోటీసులు జారీ చేయుటకు ఆదేశములు యిచ్చుచూ పై పిటిషనను తే1-5-2023దీ నాటికి వాయిదా వేసియున్నారు. కావున యిరువురూ **తే 1-5-2023దీన ఉదయం 10-30గంటల**కు పై కోర్టువారి యెదుట హాజరై మీ వాదనను స్వయముగా గాని, లేక మీ న్యాయవాది ద్వారాగాని దాఖలు చేసుకొనవలయును. అందుకు తప్పిన యెడల శ్రీ కోర్టువారు మీ పరోక్షములో తదుపరి ఉత్తర్వులు గైకొందురని యిందు మూలముగా తెలియజేయడమైనది.

బిత్రా సూర్యారావు
వాది తరుపు న్యాయవాది
గజపతినగరం

నోటీసు
మహారాజశ్రీ గజపతినగరం జూనియర్ సివిలు జడ్జివారి కోర్టులో
I.A. 43/2023 in O.S.48/2017

బిట్వీన్ :
కొల్లి రామునాయుడు (died) మరి ఇతరులు
....పిటిషనర్లు/వాదులు
మరియు :
కొల్లి రామమూర్తి (died) మరి 6గురు
....రెస్పాండెంట్లు/ప్రతివాదులు
To
R5. శ్రీమతి కొల్లి సింహాచలం W/o లేటు రామమూర్తి, హిందూ, 64సం॥, గృహకృత్యయులు, పోలవంగర గ్రామం, దత్తిరాజేరు మండలం, విజయనగరం జిల్లా.
R6. శ్రీ కొల్లి అప్పారావు S/o లేటు రామమూర్తి, హిందూ, 45సం॥, వ్యవసాయం, పోలవంగర గ్రామం, దత్తిరాజేరు మండలం, విజయనగరం జిల్లా.

పై దావాలో వాదులు దావా పరిహారం సవరణలు చేయు నిమిత్తం అనుమతి కోరుచూ కోర్టువారి ఎదుట పై నెంబరు పిటిషను దాఖలు చేయుటయు, కోర్టువారు మీకు నోటీసులు పలుమార్లు పంపినప్పటికీ మీరు సదరు నోటీసులను తప్పించుకొని తిరుగుచున్నందున శ్రీ కోర్టువారు పత్రికా ప్రకటన ద్వారా నోటీసులు జారీ చేయుటకు ఆదేశములు యిచ్చుచూ పై పిటిషనను తే 1-5-2023దీ నాటికి వాయిదా వేసియున్నారు. కావున యిరువురూ **తే 1-5-2023దీన ఉదయం 10-30గంటల**కు పై కోర్టువారి యెదుట హాజరై మీ వాదనను స్వయముగా గాని, లేక మీ న్యాయవాది ద్వారాగాని దాఖలు చేసుకొనవలయును. అందుకు తప్పిన యెడల శ్రీ కోర్టువారు మీ పరోక్షములో తదుపరి ఉత్తర్వులు గైకొందురని యిందు మూలముగా తెలియజేయడమైనది.

బిత్రా సూర్యారావు
వాదులు తరుపు న్యాయవాది
గజపతినగరం